


# నీరజ్‌కు డైమండ్ లీగ్ టైటిల్

- పారిస్‌లో మెరిసిన స్టార్ అథ్లెట్
- 88.16మీటర్లతో అగ్రస్థానం

పారిస్: భారత స్టార్ అథ్లెట్ నీరజ్‌చోప్రా మరోమారు సత్తాచాటాడు. పారిస్ వేదికగా శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ పోరులో నీరజ్ టైటిల్‌తో మెరిశాడు. గత రెండేండ్ల వ్యవధిలో నీరజ్‌కు ఇది తొలి (డైమండ్ లీగ్) టైటిల్ కావడం విశేషం. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పోరులో నీరజ్ 88.16మీటర్ల దూరంతో అగ్రస్థానంలో నిలిచాడు. తన తొలి ప్రయత్నంలోనే ఈ మార్క్ అందుకున్న నీరజ్ అనుకున్న లక్ష్యాన్ని చేరుకున్నాడు. దోహాలో 90.23మీటర్ల మార్క్‌తో వ్యక్తిగత అత్యుత్తమ రికార్డు అందుకున్న నీరజ్ పారిస్‌లో లక్ష్యానికి సమీపంగా వచ్చినా 2 మీటర్ల దూరంలో ఆగిపోయాడు. అయితే 90 మీటర్ల మార్కును అందుకోకపోయినా డైమండ్ లీగ్ టైటిల్‌ను దక్కించుకున్నాడు. సరిగ్గా 8 ఏండ్ల క్రితం 84.67మీటర్లతో పారిస్‌లో ప్రపంచ జూనియర్ చాంపియన్‌గా నిలిచిన చోప్రా ఇన్నాళ్లకు అదే వేదికపై డైమండ్ లీగ్ టైటిల్‌ను తన ఖాతాలో వేసుకోవడం విశేషం. ఆది నుంచే అద్భుత ప్రదర్శన కనబరిచిన నీరజ్ రెండో ప్రయత్నంలో 85.10మీటర్లు విసిరి ఆ తర్వాత వరుసగా మూడు ఫౌల్స్ చేశాడు. చివర్లో 82.89మీటర్లతో తన పోటీని చోప్రా ముగించాడు. ఇదే విభాగంలో పోటీపడ్డ జులియన్ వెబర్ (87.88మీ), లూయిజ్ మారిసియో (86.62మీ) వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. ఈ ఈవెంట్‌కు ముందు నీరజ్‌కు ప్రధాన పోటీదారుగా భావించిన అండర్సన్ పీటర్స్(80.29మీ) ఐదో స్థానంతో నిరాశపరిచాడు. ఈనెల 24న చెక్ రిపబ్లిక్ వేదికగా జరిగే ఒస్ట్రావా గోల్డెన్ స్పైక్ మీట్‌లో నీరజ్ బరిలోకి దిగనున్నాడు.



# తెలంగాణ షూటింగ్ టోర్నీ షురూ


హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ రైఫిల్ అసోసియేషన్(టీఆర్‌ఏ) ఆధ్వర్యంలో గచ్చిబౌలి సాట్స్ రేంజ్ వేదికగా 11వ రాష్ట్ర షూటింగ్ చాంపియన్‌షిప్ శనివారం మొదలైంది. ఈనెల 30 వరకు జరిగే టోర్నీలో దాదాపు 500మందికి పైగా యువ షూటర్లు వివిధ విభాగాల్లో పోటీపడుతున్నారు. ప్రతిభ కల్గిన యువ ప్లేయర్లను వెలుగులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో మొదలైన టోర్నీలో వివిధ విభాగాల్లో సత్తాచాటేందుకు షూటర్లు సిద్ధంగా ఉన్నారు. టోర్నీ తొలి రోజు ప్రాక్టీస్, క్వాలిఫయింగ్ రౌండ్లు జరుగగా, ఆదివారం నుంచి ప్రధాన పోటీలు జరుగనున్నాయి. టోర్నీలో 10మీ ఎయిర్‌రైఫిల్-పిస్టల్, 25మీటర్ల పిస్టల్, 50మీటర్ల రైఫిల్, ట్రాప్ ఈవెంట్లలో షూటర్లు బరిలోకి దిగనున్నారని టీఆర్‌ఏ అధ్యక్షుడు అమిత్‌సంఘి పేర్కొన్నారు. పోటీలను అధికారికంగా ప్రారంభించిన ఆయన..తెలంగాణలో ప్రతిభ కల్గిన షూటర్లు కొదువలేదన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తీసిపోకుండా టోర్నీని నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# ఇంగ్లండ్ దీటుగా..

**పోప్ అజేయ శతకం ● ఇంగ్లండ్ 209/3 ● భారత్ 471 ఆలౌట్ ● రిషభ్ పంత్ సెంచరీ**

హెడింగ్లీ: భారత్‌తో లీడ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టు మొదటి రోజు బంతితో విఫలమైన ఇంగ్లండ్.. రెండో రోజు మాత్రం పుంజుకుంది. బంతితో టీమ్‌ఇండియాను కట్టడిచేసిన బెన్ స్టోక్స్ సేన.. బ్యాట్‌తోనూ తమకు అచ్చొచ్చిన 'బజ్‌బాల్' ఆటతో దీటుగా బదులిస్తున్నది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో టీమ్‌ఇండియాను తొలి సెషన్‌లోనే 471 పరుగులకు ఆలౌట్ చేసిన ఆ జట్టు.. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చి రెండో రోజు ఆట ముగిసేసరికి 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. ఓలీ పోప్ (131 బంతుల్లో 100 నాటౌట్, 13 ఫోర్లు) అజేయ శతకంతో మెరవగా, బెన్ డకెట్ (94 బంతుల్లో 62, 9 ఫోర్లు) రాణించారు. ప్రస్తుతం పోప్‌తో పాటు హ్యారీ బ్రూక్ (0 నాటౌట్) క్రీజులో ఉండగా తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు ఇంకా 262 రన్స్ వెనుకబడి ఉంది. అంతకుముందు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో మెన్ ఇన్ బ్లూ.. ఓవర్ నైట్ స్కోరుకు 112 పరుగులు జోడించి ఆలౌట్ అయింది. రిషభ్ పంత్ (178 బంతుల్లో 134, 12 ఫోర్లు, 6 సిక్సర్లు) రికార్డు శతకంతో కదం తొక్కగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (147).. మొదటి రోజు ఆటకు మరో 20 పరుగులు జోడించాడు. బెన్ స్టోక్స్, జోష్ టంగ్ తలా నాలుగు వికెట్లు పడగొట్టారు.




### 41 పరుగులకు 7 వికెట్లు

క్రీజులో ఇద్దరు శతకాలు చేసిన బ్యాటర్లతో పాటు మరో ఏడు వికెట్లు చేతిలో ఉండటంతో టీమ్‌ఇండియా అలవోకగా 550+ స్కోరు చేస్తుందని ఆశించిన అభిమానులకు ఒకింత నిరాశ ఎదురైంది. 41 పరుగుల వ్యవధిలో భారత్ చివరి 7 వికెట్లను కోల్పోయింది. బషీర్ ఓవర్లో గిల్.. జోష్ టంగ్‌కు క్యాచ్ ఇవ్వడంతో 209 పరుగుల నాలుగో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. సుదీర్ఘకాలం తర్వాత జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న కరుణ్ నాయర్ (0).. స్టోక్స్ బౌలింగ్‌లో షార్ట్ కవర్ వద్ద ఓలీ పోప్ కండ్లు చెదిరే క్యాచ్‌తో డకౌట్‌గా వెనుదిరిగాడు. టంగ్ ఓవర్లో పంత్ వికెట్ల ముందు బలవగా లంచ్‌కు ముందు స్టోక్స్.. శార్దూల్‌ను ఔట్ చేశాడు. భోజన విరామం తర్వాత టంగ్.. రెండు ఓవర్ల వ్యవధిలో బుమ్రా, జడేజా, ప్రసిద్ధ్‌ను వెనక్కి పంపడంతో టీమ్‌ఇండియా ఆలౌటైంది.

### ఇంగ్లండ్ ధనాధన్

భారత ఇన్నింగ్స్ ముగిశాక వర్షం రావడంతో ఆటకు కొద్దిసేపు అంతరాయం కలిగినా ఆ తర్వాత ఇంగ్లండ్.. బజ్‌బాల్ విధ్వంసం సృష్టించింది. టీమ్ ఇండియా తురుపుముక్క బుమ్రా.. తొలి ఓవర్‌లోనే జాక్ క్రాలీ (4)ని ఔట్ చేసినా భారత్ ఆ దూకుడును కొనసాగించలేకపోయింది. క్రీజులో కుదురుకునేదాకా డకెట్ కాస్త నెమ్మదిగా ఆడినా మూడో స్థానంలో వచ్చిన పోప్ మాత్రం ఆరంభం నుంచే బ్యాటుకు పనిచెప్పడంతో ఇంగ్లండ్ రన్‌రేట్ 5కు తగ్గకుండా దూసుకెళ్లింది. ఓవర్‌కు తలా ఓ బౌండరీతో రెచ్చిపోయిన ఈ జంటను విడదీయడానికి గిల్ పదేపదే బౌలర్లను మార్చి ప్రయోగించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ద్వయం బుమ్రాతో పాటు సిరాజ్, ప్రసిద్ధ్ బౌలింగ్‌లో వేగంగా పరుగులు రాబట్టింది. జడేజా వేసిన 22వ ఓవర్లో స్క్వేర్ లెగ్ బౌండరీతో డకెట్ 68 బంతుల్లో అర్ధ శతకంతో పాటు ఈ జోడీ వంద పరుగుల భాగస్వామ్యం పూర్తైంది. టీ విరామం అనంతరం బుమ్రా వేసిన ఓవర్లో ఫోర్‌తో పోప్ హాఫ్ సెంచరీ పూర్తైంది. అయితే జస్‌ప్రీత్.. 28వ ఓవర్లో డకెట్‌ను క్లీన్‌బౌల్డ్ చేసి 122 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరదించాడు. డకెట్ నిష్క్రమణ తర్వాత ఇంగ్లండ్ స్కోరు వేగం కూడా మందగించింది. జో రూట్ (28) ఆరంభంలో బుమ్రా, సిరాజ్‌ను ఎదుర్కొనేందుకు ఇబ్బందిపడ్డాడు. 80లలోకి వచ్చాక మళ్లీ దూకుడు పెంచిన పోప్.. బుమ్రా బౌలింగ్‌లో సింగిల్‌తో తన కెరీర్‌లో తొమ్మిదో శతకాన్ని నమోదుచేశాడు. కానీ మరుసటి బంతికే రూట్.. స్లిప్స్‌లో కరుణ్ చేతికి చిక్కాడు. టెస్టులలో బుమ్రా బౌలింగ్‌లో ఔట్ అవడం రూట్‌కు ఇది పదోసారి కావడం విశేషం. బుమ్రా బౌలింగ్‌లోనే బ్రూక్.. సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చినా అది కాస్తా నోబాల్ కావడంతో అతడు బతికిపోయాడు.

#### సంక్షిప్త స్కోర్లు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** భారత్ తొలి ఇన్నింగ్స్: 471 ఆలౌట్ (గిల్ 147, పంత్ 134, స్టోక్స్ 4/66, టంగ్ 4/86); **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** 49 ఓవర్లలో 209/3 (పోప్ 100*, డకెట్ 62, బుమ్రా 3/48)




### పంత్ షో

ఓవర్ నైట్ స్కోరు 359/3తో రెండో రోజు ఆటను ఆరంభించిన భారత్.. తొలి గంటన్నర పాటు మొదటి రోజు జోరునే కొనసాగించింది. వోక్స్ వేసిన రెండో ఓవర్‌లోనే ఆఫ్‌సైడ్ చూడచక్కని స్ట్రోక్‌తో గిల్ బంతిని బౌండరీకి తరలించాడు. మొదటి రోజు కాస్త సంయమనంగా ఆడిన పంత్.. రెండో రోజు మాత్రం తన సహజ శైలికి వచ్చేశాడు. బషీర్ బౌలింగ్‌లో 4, 6తో 90లలోకి వచ్చిన ఈ వికెట్ కీపర్.. డ్రింక్స్ విరామం తర్వాత బషీరే వేసిన 99వ ఓవర్లో తొలి బంతిని మిడ్ వికెట్ మీదుగా సిక్సర్ బాది 146 బంతుల్లో తన కెరీర్‌లో ఏడో శతకాన్ని అందుకున్నాడు. ఇంగ్లండ్ గడ్డపై పంత్‌కు ఇది మూడో శతకం. సెంచరీ తర్వాత అతడు మరింత ధాటిగా ఆడాడు.

## తొలి టెస్టు డ్రా

**ముగిసిన ఏంజెలో మాథ్యూస్ టెస్టు కెరీర్**

గాలె: బంగ్లాదేశ్, శ్రీలంక మధ్య గాలె వేదికగా జరిగిన తొలి టెస్టు డ్రాగా ముగిసింది. ఆట ఐదో రోజు రెండో ఇన్నింగ్స్‌లో 177/తో ఆట ఆరంభించిన బంగ్లా.. 285/6 వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో శతకం చేసిన కెప్టెన్ నజ్ముల్ హొసేన్ శాంతో (129 నాటౌట్) సెకండ్ ఇన్నింగ్స్‌లోనూ సెంచరీ సాధించాడు. ముష్ఫీకర్ రహీమ్ (49) తృటిలో హాఫ్ సెంచరీ మిస్ అయ్యాడు. 295 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన లంక.. 32 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 72 రన్స్ చేసింది. కెరీర్‌లో చివరి టెస్టు ఆడుతున్న ఏంజెలో మాథ్యూస్.. తన చివరి ఇన్నింగ్స్‌లో 8 పరుగులే చేసి పెవిలియన్ చేరాడు.



## ప్యాడ్లర్లకు నిరాశ

**మనికా, మానవ్ ఇంటి బాట**



స్లోవేనియా: వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) స్టార్ కంటెండర్ టోర్నీ రెండో అంచె పోటీలలో భారత స్టార్ ప్యాడ్లర్లు మనికా బాత్రా, మానవ్ ఠక్కర్‌కు ఆరంభ రౌండ్లలోనే నిరాశ ఎదురైంది. స్లోవేనియాలో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా శుక్రవారం రాత్రి ముగిసిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో మనికా.. 0-3 (9-11, 6-11, 4-11)తో హి ఝుజియ (చైనా) చేతిలో చిత్తుగా ఓడిపోయింది. తొలి రౌండ్‌లో 3-0తో పు యు (పోర్చుగల్)ను ఓడించిన మణికా.. చైనా అమ్మాయి ముందు తేలిపోయింది. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో మానవ్ ఠక్కర్.. 0-3తో యు ఫి (చైనా) చేతిలో ఓడాడు. అంతకుముందు పురుషుల డబుల్స్‌లో మానవ్, మనుష్ షా జంట సైతం.. తొలి రౌండ్‌లో 1-3తో (10-12, 6-11, 11-8, 6-11)తో కొరియన్ ద్వయం కిమ్ మిన్హైక్-పార్క్ గంగ్హైన్ జోరు ముందు నిలువలేకపోయింది.

## భారత జట్ల నిష్క్రమణ!

**ఎఫ్ఐహెచ్ ప్రొలీగ్**

అంట్వెర్ప్(బెల్జియం): ప్రతిష్టాత్మక ఎఫ్ఐహెచ్ లీగ్‌లో భారత పురుషుల, మహిళల హాకీ జట్లు దాదాపు నిష్క్రమించాయి. శనివారం జరిగిన తమ 10వ మ్యాచ్‌లో భారత పురుషుల జట్టు 3-6 తేడాతో బెల్జియం చేతిలో ఘోర ఓటమి ఎదుర్కొంది. బెల్జియంకు ఏ దశలోనూ పోటీనివ్వలేకపోయిన టీమ్‌ఇండియా మూల్యం చెల్లించుకుంది. దీంతో టోర్నీలో 15 మ్యాచ్‌లాడిన భారత్ ఐదు గెలిచి పదింటిలో ఓడి ప్రస్తుతం 15 పాయింట్లతో 8వ స్థానంలో కొనసాగుతున్నది. మ్యాచ్ విషయానికొస్తే భారత్ తరఫున దిల్‌ప్రీత్‌సింగ్, మన్‌దీప్‌సింగ్, అమిత్ రోహిదాస్ ఒక్కో గోల్ చేశారు. మహిళల విభాగంలోనూ మన అమ్మాయిలకు నిరాశే ఎదురైంది. పూర్తి ఏకపక్షంగా సాగిన పోరులో భారత్ 1-5తో బెల్జియం చేతిలో ఘోర ఓటమిని ఎదుర్కొంది. దీపిక(6ని) భారత్‌కు ఏకైక గోల్ అందించింది. లీగ్‌లో 13 మ్యాచ్‌లాడిన మహిళల జట్టు 10 పాయింట్లతో 8వ స్థానంలో ఉంది.

## అమ్మాయిల పతక ధమాకా

వుంగ్ తౌ(వియత్నాం): వియత్నాం వేదికగా జరుగుతున్న అండర్-23 ఏషియన్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత అమ్మాయిలు పతక జోరు కనబరిచారు. బరిలోకి దిగిన పది కేటగిరీల్లో మహిళా రెజ్లర్లు నాలుగు స్వర్ణాలు సహా ఐదు రజతాలు, కాంస్యం కైవసం చేసుకున్నారు. ప్రియాంశి(50కి), రీనా(55కి), శ్రిస్తి(68కి), ప్రియ(76కి) పసిడి పతకాలతో మెరిశారు. నేహా శర్మ(57కి), తన్వి (59కి), ప్రగతి(62కి), శిక్షా(65కి),జ్యోతి బెర్వాల్(72కి) ప్రత్యర్థుల చేతుల్లో ఓడి రజతాలతో సంతృప్తి పడ్డారు. మరోవైపు పురుషుల గ్రీకోరోమన్ విభాగంలో సుమిత్(63కి) స్వర్ణం సాధించగా, నితేశ్(97కి), అంకిత్(72కి) కాంస్యాలు సొంతం చేసుకున్నారు. ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో వికీ(97కి) పసిడి కైవసం చేసుకున్నాడు.





## వీరమల్లు వచ్చేది అప్పుడే..!

**పవన్‌కల్యాణ్** 'హరిహరవీరమల్లు' చిత్రాన్ని జూలై 24న విడుదల చేస్తున్నట్లు శనివారం మేకర్స్ ప్రకటించారు. ఇప్పటికే పలుమార్లు ఈ సినిమా రిలీజ్ వాయిదా పడిన విషయం తెలిసిందే. చిత్రాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నంలో విడుదల విషయంలో జాప్యం జరిగిందని గతంలో మేకర్స్ ప్రకటించారు. తాజాగా కొత్త రిలీజ్ డేట్ ప్రకటించడంతో ఇకపై ఎలాంటి వాయిదాలు ఉండొద్దని అభిమానులు కోరుకుంటున్నారు. క్రిష్ జాగర్లమూడి, జ్యోతికృష్ణ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ఎ.ఎం.రత్నం సమర్పణలో దయాకర్ రావు నిర్మించారు. మొఘల్ కాలం నాటి ఈ కథలో పవన్‌కల్యాణ్.. పెద్దల దగ్గర సంపదను కొల్లగొట్టి పేదలకు పంచే బందిపోటు దొంగ వీరమల్లు పాత్రలో కనిపించనున్నారు. ఆస్కార్ విజేత ఎం.ఎం.కీరవాణి సంగీతాన్నందిస్తున్నారు. త్వరలో ట్రైలర్‌ను విడుదల చేస్తామని చిత్రబృందం పేర్కొంది. నిధి అగర్వాల్, బాబీ డియోల్, అనుపమ్‌ఖేర్, సత్యరాజ్ తదితరులు చిత్ర తారాగణం.

**చిత్రం**



## 'కుబేర'కు అంతటా బ్లాక్‌బస్టర్ టాక్

**'కుబేర'** చిత్రానికి అంతటా పాజిటివ్ టాక్ లభిస్తున్నది. బ్లాక్‌బస్టర్ హిట్ అంటూ రివ్యూలొచ్చాయి. ఎప్పటి నుంచో ఓ కొత్త క్యారెక్టర్ చేయాలనుకుంటున్నా. శేఖర్ కమ్ముల తన సినిమాలోని పాత్రలను అద్భుతంగా డిజైన్ చేస్తాడు. ఈ కథ వినగానే నాది మెయిన్ క్యారెక్టర్ అనిపించింది. నేను పోషించిన దీపక్ పాత్ర మూడుషేడ్స్‌తో కనిపిస్తుంది. అందుకే బాగా నచ్చింది' అన్నారు అగ్ర నటుడు అక్కినేని నాగార్జున. ఆయన ధనుష్‌తో కలిసి నటించిన 'కుబేర' చిత్రం ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. శేఖర్ కమ్ముల దర్శకుడు. శనివారం సక్సెస్‌మీట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాగార్జున..ఈ సినిమా కోసం శేఖర్ కమ్ముల ప్రాణం పెట్టి పనిచేశారని ప్రశంసించారు. శేఖర్ కమ్ముల మాట్లాడుతూ 'నా సినిమాలన్నింటిలో అత్యంత నిజాయితీగా చేసిన చిత్రమిది. ఈ కథలో చాలా విషయాల్ని చెప్పే ప్రయత్నం చేశా. ఈ క్రమంలో కాస్త నిడివి ఎక్కువైంది. అది కథకు అవసరం కూడా. ఒక పాయింట్‌ని నిజాయితీగా చెప్పడమే మా ధర్మం. ఈ సినిమా గురించి ప్రేక్షకులు గొప్పగా మాట్లాడుకోవడం చాలా గర్వంగా, ఆనందంగా ఉంది' అన్నారు. కథ విన్నప్పుడే సూపర్‌హిట్ అవుతుందని ఊహించానని, నాగార్జునగారి సపోర్ట్ వల్ల అనుకున్న సమయానికి రిలీజ్ చేయగలిగామని, హౌస్‌ఫుల్ బుకింగ్స్ వస్తున్నాయని నిర్మాత సునీల్ నారంగ్ చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా సినిమాకు బ్లాక్‌బస్టర్ హిట్ టాక్ వచ్చిందని మరో నిర్మాత పుస్కూర్ రామ్మోహన్ రావు తెలిపారు.



## శివాజ్ఞ వల్లే ఇది సాధ్యమైంది

**'భగవంతుని** ఆశీస్సుల వల్లే ఈ సినిమా చేయగలిగా. అందరూ హీరోలే ఈ సినిమాలో. అందరూ విజయాలను అందుకున్నవారే. వీరంతా అందించిన సహకారం వల్లే ఇది సాధ్యమైంది. మహాభారతం సీరియల్ అద్భుతంగా తీసిన ముఖేష్‌కుమార్‌సింగ్ ఈ సినిమాను అత్యద్భుతంగా తీశాడు. బోయవాడు తిన్నడు ఈశ్వరుడి కళ్లిచ్చి కన్నప్ప అయ్యాడు. అది ఎలాగో రేపు సినిమా చూస్తే తెలుస్తుంది.' అని డా.మోహన్‌బాబు అన్నారు. మంచు విష్ణు హీరోగా ఆయన నిర్మించిన భక్తిరసాత్మక చిత్రం 'కన్నప్ప'. మోహన్‌బాబు, మోహన్‌లాల్, అక్షయ్‌కుమార్, ప్రభాస్, శరత్‌కుమార్, కాజల్ అగర్వాల్ ప్రత్యేక పాత్రలు పోషించిన ఈ పానిండియా చిత్రానికి ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకుడు. ఈ నెల 27న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మోహన్‌బాబు మాట్లాడారు. 'ఎంతో రీసెర్చ్ చేసి ఈ స్క్రిప్ట్ తయారు చేశా. శివాజ్ఞ వల్లే ఇదంతా సాధ్యమైంది. ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ పేరుపేరున ధన్యవాదాలు. ఎన్నో కష్టాలకోర్చి సినిమా చేశాను. ఇంకొన్ని రోజుల్లో విడుదలవుతోంది. ఆదరిస్తారని ఆశిస్తున్నా.' అని మంచు విష్ణు పేర్కొన్నారు.



## అలా అనుకుంటే విజయం ఖాయం

**తన ఇన్‌స్టా** ద్వారా అభిమానులకు నాలుగు మంచి మాటలు చెబుతూ ఉంటారు అగ్ర కథానాయిక సమంత. రీసెంట్‌గా తన ఇన్‌స్టా ద్వారా అభిమానులకు ఓ విలువైన సందేశాన్ని పంపారామె. 'ఇతరుల మాటలు పట్టించుకొని ప్రశాంతతను పాడు చేసుకోవద్దు. 'ఏదైతే అది కానీ' అనే ధోరణితో ఉంటే ప్రశాంతత లభించదు. పాజిటివ్‌గా ఆలోచిస్తేనే ప్రశాంతత. దానికి సాధన అవసరం. 'నేను చేయాల్సింది..' అనే మాటను 'నేను తప్పకుండా చేసి తీరాల్సిందే..' అనే విధంగా మార్చుకుంటే విజయం మన వెంటే ఉంటుంది. ఆత్మ సంఘర్షణ ఆరోగ్యానికి మంచిది కాదు. మనసు వేగంతో కాదు.. నిశ్చలత్వంతోనే ప్రశాంతంగా ఉంటుంది. మానసిక ఒత్తిళ్లు మన గౌరవానికి అవరోధం కాకూడదు.' అంటూ రాసుకొచ్చింది సమంత.




## ఐపీఎస్ కథ 'ది 100'

**'మొగలి రేకులు'** ఫేమ్ ఆర్‌కే సాగర్ నటిస్తున్న యాక్షన్ చిత్రం 'ది 100'. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకుడు. ఈ చిత్రాన్ని జూలై 11న విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. శనివారం చిత్రంలోని 'హే మేఘాలే' అనే పాటను విడుదల చేశారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతాన్నందించిన ఈ గీతాన్ని రేవంత్, సాహితి చాగంటి ఆలపించారు. శ్రీహర్ష ఎమ్మానీ రచన చేశారు. ఈ సందర్భంగా ఆర్‌కే సాగర్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నేను ఐపీఎస్ అధికారి విక్రాంత్‌గా కనిపిస్తా. నిజాయితీ, ధైర్యం కలిగిన పోలీస్ ఆఫీసర్‌గా కథగా మెప్పిస్తుంది. యాక్షన్‌తో పాటు కథలోని సామాజిక సందేశం ఆకట్టుకుంటుంది' అన్నారు. విభిన్నమైన కాన్సెప్ట్‌తో రూపొందించిన పోలీస్ కథ ఇదని దర్శకుడు శశిధర్ చెప్పారు. మిషా నారంగ్, ధన్యబాలకృష్ణ, వీవీ గిరిధర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, నిర్మాతలు: రమేష్ కరుటూరి, వెంకీ, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: రాఘవ్ ఓంకార్ శశిధర్.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.